క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

సీతంపేట: విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల హెచ్ఎంలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా జ్వరాలు ప్రబలితే విద్యార్థులను వెంటనే సమీప పీహెచ్‌సీలకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యవర్తిత్వం - దేశం కోసం'పై అవగాహన ర్యాలీ



కురుపాంలో మధ్యవర్తిత్వం-దేశం కోసం కార్యక్రమంపై అవగాహన ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కురుపాం మండల కేంద్రంలోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సభ్యులు గౌటారి వెంకటరావు, పారా లీగల్ వాలంటీర్ అంధవరపు కోటేశ్వరరావు, మండల న్యాయ సేవ సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్ బుధవారం కురుపాంలో మధ్యవర్తిత్వం..దేశం కోసంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో ఎన్నో కేసులు పరిష్కారం అవుతున్నాయన్నారు. తద్వారా బాధితులకు కూడా కొంత మేర న్యాయం లభిస్తుందన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య పనులు

భామిని: మండలంలోని కీసరలో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల పరిసరాలల్లో బుధవారం చెత్తాచెదారాలు ఏరి వేశారు. పనులను సర్పంచ్ వలరౌతు రామకృష్ణ, కార్యదర్శి సుబ్బారావు పర్యవేక్షించారు.

ఆర్థిక సాయం అందజేత



పుష్పశ్రీవాణి పంపిన ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కన్వీనర్ గౌరీశంకరరావు, పార్టీ శ్రేణులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలంలోని ఉరిటి పంచాయతీ బొడ్డమానుగూడ గ్రామ సమీపంలోని ఇటుక బట్టీలో నెల కొన్న గుంత వద్ద చేపల కోసం దిగి గత నెలలో జెసికా, సునంద అనే విద్యార్థినిలు మృతిచెందిన సంగతి విదితమే. ఈ మేరకు ఇటీవల బాధిత కుటుంబాల్ని పరామర్శించిన మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఇరు కుటుంబాలకు ఆర్థిక సాయం పంపించారు. ఆమె పంపించిన ఆర్థిక సాయాన్ని ఇరు కుటుంబాలకు కురుపాం మండలం వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, ఎంపీటీసీ గుడారి విద్యారాణి, మాజీ ఎంపీపీ అనిమి ఇందిరాకుమారి, వైస్ ఎంపీపీ రంగారావు, నాయకులు రేవు సత్తిబాబు, రామకృష్ణ తదితరులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు



నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని పాలకొండ ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. బుధవారం స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..నాయకత్వ ప్రాముఖ్యత, విశిష్టత, చిత్తశుద్ధి, నిబద్ధత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉత్తమ విద్యార్థి నాయకులు వ్యక్తిగత బ్యాడ్జీలను అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌చార్జ్ ఎస్.వెంకటేష్, ప్రిన్సిపాల్ టి.సుబ్రహ్మణ్యం, డివిజనల్ ఇన్‌చార్జ్ చుక్కా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

వీరఘట్టం: బ్యాంకుల్లో ఎప్పుడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే వాటి నుంచి ఎలా బయట పడాలి..బ్యాంక్ ఆస్తులను ఎలా పరిరక్షించాలి, తదితర అంశాలపై పాలకొండ ఫైర్ అధికారి జామి సర్వేశ్వరరావు వివరించారు. బుధవారం స్థానిక యూనియన్ బ్యాంక్‌లో ఖాతాదారుల, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా ఎఫెక్ట్..
ఆందోళనలో అన్నదాత

- పట్టణ రైతులకు తప్పని పాట్లు
- వీరఘట్టంలో పీఏసీఎస్ ఉండడంతో యూరియా సరఫరా నిలిపివేసిన ప్రభుత్వం
- సొసైటీకి వచ్చిన రెండు లారీల యూరియాను తరలించుకుపోయిన గ్రామీణ రైతులు



వీరఘట్టం రైతుసేవా కేంద్రం వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీకి చెందిన రైతులు యూరియా కోసం కొద్ది రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా యూరియా కొరత లేదంటున్న అధికారులకు వీరఘట్టంలో కొరత ఉందనే విషయం తెలియకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు మండిపడుతున్నారు. స్థానిక రైతుసేవా కేంద్రానికి యూరియా వస్తుందని తెలియడంతో బుధవారం తెల్లవారేసరికి రైతులందరూ రైతుసేవా కేంద్రానికి చేరుకున్నారు. ఆదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు యూరియా కోసం ఎదురు చూశారు. అయినా యూరియా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

వీరఘట్టంలో వింత పరిస్థితి...

మండల వ్యాప్తంగా 24 సచివాలయాలు ఉండగా వీరఘట్టం మేజర్ పంచాయతీలో నాలుగు సచివాలయాలున్నాయి. ఈ నాలుగు సచివాలయాలకు తప్ప, మండలంలోని మిగిలిన 20 సచివాలయాలకు యూరియా వస్తోంది. ఎందుకిలా జరుగుతోందని ఆరా తీస్తే స్థానికంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఉంటే అక్కడ సచివాలయాలకు ప్రభుత్వం యూరియా సరఫరా చేయదంట. ఇంతవరకు స్థానిక పీఏసీఎస్‌కు రెండు లారీల యూరియా (880 బస్తాలు) 44 టన్నులు వచ్చింది. ఈ యూరియాను గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు తీసుకున్నారు. దీంతో వీరఘట్టం మేజర్ పంచాయతీలో ఉన్న రైతులకు ఒక్క బస్తా కూడా అందకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

సచివాలయాలకు యూరియా సరఫరా చేయాలి...

స్థానికంగా పీఏసీఎస్ ఉండడంతో సచివాలయాలకు యూరియా సరఫరా నిలిపివేయడం సరి కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరఘట్టంలో ఉన్న నాలుగు సచివాలయాలకు కూడా యూరియా పంపిణీ చేస్తే ఇబ్బందులు తొలగుతాయని అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టి వీరఘట్టంలో ఉన్న రైతులకు కూడా యూరియా అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

వీరఘట్టం మేజర్ పంచాయతీలో యూరియా కొరత ఉంద నే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఇక్కడ పీఏసీఎస్ ఉండడంతో సచివాలయాలకు యూరియా ఇవ్వడం లేదనే విష యాన్ని కూడా అధికారులకు తెలియజేశాం. యూరియా కొరత లేకుండా చర్యలు చేపడతాం. – జె.సౌజన్య, మండల వ్యవసాయశాఖ అధికారి, వీరఘట్టం

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..!

- కూటమి నాయకులకు వైఎస్సార్‌సీపీ నేతల సవాల్



మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి హయాంలో కురుపాం నియోజకవర్గంలోని గ్రామాలు, పంచాయతీలు, మండలాలు, నియోజకవర్గ స్థాయిలో జరిగిన అభివృద్ధిపై తాము సిద్ధంగా ఉన్నామని, ఏడాది కూటమి పాలనలో చేసిన అభివృద్ధిపై ఆ నేతలు చర్చకు సిద్ధమేనా..! అని వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. గుమ్మలక్ష్మీపురంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, ఆ పార్టీ నేతలు గోరిశెట్టి గిరిబాబు, నిమ్మక గోపాల్, బొత్తాడ గౌరీశంకరరావు మాట్లాడారు. ఇటీవల కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని కూటమి ఏడాది పాలనలోనే చేశామంటూ చేసిన అసత్య ప్రచారాలపై వైఎస్సార్‌సీపీ నేతలు ఘాటుగా స్పందించారు. జనసేన ప్రస్తుత ఇంచార్జ్ కె.మల్లేశ్వరరావు అనామకుడిగా ఉన్న సమయంలో తన స్వగ్రామమైన గుణదకు పాముల పుష్పశ్రీవాణి ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లగా తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరగా బీటీ రోడ్డును వేశారని దాన్ని మల్లేశ్వరరావు గుర్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఒకే ఒక్క వైద్యాధికారి, ఇరువురు స్టాఫ్‌నర్సులతో కొనసాగిన భద్రగిరి సీహెచ్‌సీని తమ ప్రభుత్వ హయాంలో 20 పడకల నుంచి 50 పడకలు, ఆపై 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రారంభించిన నూతన భవన నిర్మాణ పనులు కూడా 70 శాతం జరిగాయన్నారు. అదే ఆసుపత్రిలో 9 మంది వైద్యులు, 12 మంది స్టాఫ్ నర్సు నియామకం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. కురుపాం నియోజకవర్గంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి పుష్పశ్రీవాణి ఎంతో కృషి చేశారన్నారు. కూటమి ఏడాది పాలనలో గోవులు లేకుండానే గోశాలల పేరిట గెస్ట్ హౌస్‌లు, విశ్రాంతి భవనాలు కట్టుకున్నారే తప్ప నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. సుపరిపాలన పేరిట గ్రామాలకు వెళ్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి గ్రామాల్లోని వారి పార్టీ కార్యకర్తల ఇళ్లకు మాత్రమే వెళ్లి వెనుదిరుగుతున్నారన్నారు. వారి వెంట వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, ఎల్విన్‌పేట, లక్కగూడ సర్పంచ్‌లు ఆర్ ఎస్ చైతన్య ప్రవంతి, బి.సూర్యం, పార్టీ నాయకులు కె.వెంకటరావు, ఎస్.నాగేశ్వరరావు, చిరంజీవి ఉన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఫిర్యాదు

జియ్యమ్మవలస రూరల్: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట రమేష్, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బుధవారం ఫిర్యాదు చేశారు. ఫేస్ బుక్‌లలో, ప్రింట్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా కొందరు ఉద్దేశపూర్వకంగా మహిళలను కించపరుస్తూ వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోషల్ మీడియాలో తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో ఈ నెల 14న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణిపై ఉద్దేశపూర్వకంగా పోస్టులు పెట్టగా సదరు పోస్టుకు సంబంధించి ఫేస్‌బుక్ ఫాలోవర్ అయిన కిల్లక సీతారాం తన అకౌంట్ ద్వారా పోస్టులు పెట్టి కించపరుస్తున్నారన్నారు. తప్పుడు ఆరోపణలు చేసిన గరుగుబిల్లి మండలం పెద్దూరు గ్రామానికి చెందిన మర్రాపు పురుషోత్తంనాయుడు సోషల్ మీడియా వేదికగా ఇతర మాధ్యమాల ద్వారా గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు గ్రామ పంచాయతీకి చెందిన నిమ్మక సింహాచలం తప్పుడు ఆరోపణలు చేశారని వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలపై ఓ వైపు దాడులు పెరిగిపోతుండగా.. మరోవైపు మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నా పాలకులు గుడ్లప్పగించి చూస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలను అవమానపరిచే విధంగా వ్యవహరించే వారిపై ప్రభుత్వం స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రాంబాబు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ నివారణ, మహిళల భద్రతపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే ప్రతీ ఒక్కరూ మంచి నడవడికను అలవాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, పోక్సో యాక్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎల్విన్‌పేట సీఐ బి.శ్రీహరి, ట్రైనీ ఎస్ఐలు పాల్గొన్నారు.

● వికసించిన బ్రహ్మ కమలాలు

మండలంలోని టీడీ పారాపురం గ్రామంలో కర్నేన యోగిత ఇంటిలో బ్రహ్మ కమలాలు విరబూశాయి. శివుడికి బ్రహ్మ కమలాలు ప్రీతికరం కావడంతో యోగితతో పాటు స్థానికులు బ్రహ్మకమలం మొక్క వద్ద పూజలు చేశారు.

పాలకొండ



క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహన

సీతంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్వాంటమ్ టెక్నాలజీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుశాంత్ జనా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఉపాధి అవకాశాల మెరుగుకు కంప్యూటర్ స్కిల్స్ తప్పనిసరన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు ఎం.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు రవికిరణ్‌కుమార్, అధ్యాపకులు మంజుల, లలితకుమారి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రస్తాకుంటుబాయి ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్ పనులు చేపట్టనున్న దృష్ట్యా గుమ్మ, టిక్కబాయి, రస్తాకుంటుబాయి, మండ, టిక్కబాయి, పాడి తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏఈ ఎస్.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో న్యాయమూర్తి, న్యాయవాదులు, పోలీసులు

పాలకొండ రూరల్: న్యాయ సేవాధికార సంస్థ సూచనలతో పాలకొండ పట్టణంలో 'మధ్యవర్తిత్వం – దేశం కోసం' పేరిట బుధవారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షురాలు చందక హరిప్రియ నేతృత్వంలో చేపట్టిన ర్యాలీ న్యాయస్థానం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోర్టుల పరిధిలో ఉన్న పెండింగ్ కేసులు పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం కార్యక్రమాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న వెసులుబాటును సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మీసాల చంద్రమౌళి, ఎస్సై కె.ప్రయోగమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యూల్, సీనియర్ నాయవాదులు ఉత్తరావల్లి మురళీమోహనరావు, కనపాక సూర్యప్రకాష్, పల్లా మునిస్వామి, కర్రా రవి, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా మారిన పాలకొండ కార్గిల్ కూడలి వద్ద గొయ్యి

పాలకొండ రూరల్: పాలకొండ పట్టణం నుంచి విశాఖ, పార్వతీపురం వైపు వెళ్లే దారిలో కార్గిల్ కూడలి వద్ద ప్రమాదకర గొయ్యి ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతిలో నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ గోతిలో పడి పలువురు క్షతగాత్రులయ్యారు. కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు తమ వాహనాల్లో నిత్యం ఇదే రహదారిపై ప్రయాణం చేస్తుంటారు. కాని ఏ ఒక్కరూ గొయ్యిని పూడ్చడానికి చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికే అధికారులు, పాలకులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే గొయ్యిని పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్సు అధికారి రమణయ్య

గరుగుబిల్లి: ఎరువుల దుకాణాల యజమానులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ రమణయ్య హెచ్చరించారు. మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లోని శ్రీరామాంజనేయ ట్రేడర్స్ ఎరువులు, పురుగుల మందుల దుకాణాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. షాపులోని స్టాక్ రిజిస్టర్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందులకు సంబంధించి ధరల పట్టికలను బయట కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఎరువులతో పాటు రైతులకు అవసరం లేని ఎరువులను, పోషకాలను అంటగట్టినట్టు ఫిర్యాదులొస్తే చర్యలుంటాయన్నారు. ఎరువులకు సంబంధించి రైతులకు తప్పనిసరిగా రశీదులను ఇవ్వాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రరావు, సాంకేతిక వ్యవసాయాధికారి రవీంద్ర, ఏవో జ్యోత్స్న తదితరులున్నారు.

జ్వరాలపై అప్రమత్తం



జ్వరపీడితులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి, ఎంపీడీఓ వసంతకుమారి

భామిని: వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి, ఎంపీడీఓ ఎస్. వసంతకుమారి అన్నారు. మండలంలోని తాలాడలో బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న వైద్యశిబిరాన్ని బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం జ్వరపీడితుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అమరాన జగన్నాథరావు, సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి, కార్యదర్శి నాగేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● అధ్వాన రహదారి..



మండలంలోని గుడ్డిమీదగూడ నుంచి కడగండికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అసలే ఘాట్‌రోడ్డు కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో 108 వాహనం కూడా రాలేకపోతోందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. – సీతంపేట

జిల్లాలో యూరియా కొరత లేదు

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్ పాల్



చలివేంద్రిలో రైతులకు యూరియా అందజేస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్ పాల్

వీరఘట్టం: జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని చలివేంద్రి, వండువ గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలను బుధవారం సందర్శించి, రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆకుమడుల్లో వేసుకోవడానికి యూరియా పంపిణీ చేస్తున్నామని, రానున్న రోజుల్లో అధిక మోతాదులో యూరియా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కౌలురైతులు గుర్తింపు కార్డులు తీసుకువస్తే యూరియా, డీఏపీ అందిస్తామని తెలిపారు. కౌలు గుర్తింపు కార్డులు లేనివారు భూ యజమాని అనుమతిపత్రం తీసుకువచ్చినా సరిపోతుందని చెప్పారు. మండలంలో బుధవారం ఒక్కరోజే 60 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ శాఖాధికారి జక్కువ సౌజన్య, ఏఏఓలు సౌమ్య, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. అలాగే తూడి గ్రామంలో ఏడీఏ రత్నకుమారి యూరియా పంపిణీ చేశారు.

బియ్యం కోసం లబ్ధిదారుల ఆందోళన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): బకాయి ఉన్న ఒక నెల రేషన్ బియ్యం ఇవ్వాలని కురుపాం మండలంలోని ఉదయపురం గ్రామంలోని డీఆర్ డిపో వద్ద లబ్ధిదారులు బుధవారం ఆందోళన చేశారు. ఈ మేరకు డిపోలో పని చేస్తున్న డీలర్ డిపో పరిధిలోని సుమారు 12 గ్రామాలకు చెందిన కార్డుదారులకు జూన్ నెలలో ఇవ్వాల్సిన బియ్యం పూర్తిగా ఇవ్వలేదని, ఆ డీలర్ స్థానంలో మరో వ్యక్తిని నియమించి జూలైకు సంబంధించిన బియ్యం ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఇలా అయితే జూన్‌కు సంబంధించిన బియ్యం ఏమైనట్లని, ఎవరికిచ్చారని లబ్ధిదారులు ప్రశ్నించారు. సమాచారం తెలుసుకున్న డీటీ సాంబమూర్తి డిపో వద్దకు చేరుకుని ఆరా తీశారు. ఆయా గిరిజన గ్రామాల లబ్ధిదారులంతా డీటీతో మాట్లాడుతూ తమకు జూన్ నెలకు సంబంధించిన సుమారు 250 బస్తాల బియ్యం సేల్స్ మేన్ ఇవ్వకుండా ఎగ్గొట్టాడని ఆరోపించారు.

తక్షణమే ఇప్పించాలని లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. డీటీ సర్ది చెప్పడంతో వెనుతిరిగిన లబ్ధిదారులు విలేకర్లతో మాట్లాడుతూ తమకు ఇవ్వాల్సిన బియ్యం ఈ నెలలో ఇవ్వకుంటే కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిద్ధమవుతామని తెలిపారు.

నీట మునిగిన పంట పొలాలు



రాజుపేట సమీపంలో పంట భూముల్లోకి నిలిచిన వర్షపు నీరు

పాలకొండ రూరల్: ఖరీఫ్ ప్రారంభం నుంచి అన్నదాతలకు వాతావరణ స్థితిగతులు అనుకూలించడం లేదు. విత్తన కార్తె సమయంలో నీటి వనరులు అనుకూలించక, వరుణిడి కరుణ లేక వెదలు జల్లాల్సిన రైతులు ఇబ్బందులు పడ్డారు. అటుపై అధిక మదుపులు పెట్టి నారుమడులు సిద్ధం చేశారు. అదును చూసి విత్తనాలు పోసినా ప్రభుత్వం శివారు ప్రాంతాలకు కీలక సమయంలో సాగునీరు అందించకపోవడంతో రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు, కాలువల ద్వారా నీటి లభ్యతకు అర్జీలు చేసుకున్నారు. ముఖ్యంగా తోటపల్లి, గ్రామీణ సాగునీటి కాలువలు సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో సమయం మించిపోతుండడంతో కొంతమంది రైతులు మరోమారు వరి నారు పోశారు. కీలక సమయంలో వరుణుడు కరుణించినప్పటికీ లోతట్టు పంట భూముల్లో నీరు అధికంగా చేరడంతో నారుమడులకు నష్టం వాటిల్లిందని వీరఘట్టం రహదారి ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రోడ్డులో మరోపక్క ఉన్న వరి భూములకు నీటి లభ్యత లేదు. మండల పరిధిలోని రుద్రిపేట, వెలగవాడ, తదితర శివారు ప్రాంతాల రైతులకు అవసరం మేర నీటి వనరులు అందకపోవడంతో కాలువల ద్వారా నీరు వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.